శ్రీకోనసీమ ద్రవిడ సంఘం నూతన కార్యవర్గం



చిక్కడపల్లి: శ్రీకోనసీమ ద్రవిడ సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా వడ్లమాని బాలమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చిక్కడపల్లిలో జరిగిన 95వ వార్షిక సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆదిభట్ల కామేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బండి శ్రీనివాస్, కమిటీసభ్యుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ... సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని కోరారు. సంఘం అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సంఘం సభ్యులు ఆమెను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



ముషీరాబాద్: శ్రీనివాస నామస్మరణతో జెమిని కాలనీ మార్మోగింది. వైశాఖ బహుళ త్రయోదశిని పురస్కరించుకుని జెమినికాలనీ పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు కృష్ణపంతులు వేదమంత్రోచ్ఛారణల నడుమ శ్రీనివాస కల్యాణం సాగింది. ఈదురు గాలులు, చిరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తిరుపతి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన లడ్డూతో పాటు తులసి మొక్కలను భక్తులకు అందజేశారు. అనంతరం పురవీధుల్లో శ్రీనివాసుడి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



చిక్కడపల్లి: సురభి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు వినీత శ్రీనందన్ శిష్యులు ధృతిసుహాని, ఆరాధ్య, అద్వైత, కృషిల భరతనాట్య అరంగేట్ర ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. గణేష కౌతంతో ఆరంభించి అలరేపు, జతిస్వరం, శబ్దం, వర్ణం అంశాలను ప్రదర్శించారు. వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తొలి ప్రదర్శనలోనే అద్భుత ప్రతిభతో నాట్య ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకుల అభిమానం పొందడం అభినందనీయమని అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు కృష్ణన్, సురేష్‌బాబు, హరిదేవ్, మురళీధరన్, మురళీకృష్ణ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి కోరారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెనోవా ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులోని వాకర్స్ ఆరోగ్య పరిరక్షణ కోసం తరచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు, క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సహకారంతో ఓయూలో తరగతి గదులు

ఉస్మానియా యూనివర్సిటీ: సింగరేణి ఆర్థిక సహకారంతో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో తరగతులు నిర్మించారు. ఈసీఈ విభాగంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన తరగతి గదులను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఓయూ వీసీ ప్రొ.కుమార్ ప్రారంభించారు. సీఎస్ఆర్‌లో భాగంగా సింగరేణి ఓయూకు ఆర్థిక సహాయం చేసిన్నట్లు బలరామ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.మంగు, ఈసీఈ విభాగం హెడ్ ప్రొ.రామకృష్ణ, సింగరేణి అధికారులు భాసర్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కట్టింది ఎందుకు?

- అంబర్‌పేట ఇండోర్ స్టేడియం సమీపంలో భవన నిర్మాణం
- పూర్తయి నెలలైనా వినియోగంలోకి తీసుకురాని వైనం
- అంబర్‌పేట డివిజన్ వార్డు కార్యాలయానికి ఇక్కడకి తరలించడంలో మీనమేషాలు



అంబర్‌పేట ఇండోర్ స్టేడియం సమీపంలో నిర్మించిన కొత్త భవనం

అంబర్‌పేట: లక్షల రూపాయాలు వెచ్చించారు... ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన భవనం వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలమవుతున్నారు. అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియం పక్కన గతేడాది సుమారు రూ.30 లక్షలు నిధులతో అంబర్‌పేట డివిజన్ వార్డు కార్యాలయం కోసం భవనాన్ని నిర్మించారు. నిర్మించి నెలల గడుస్తున్నా ప్రారంభించలేదు. దీంతో అది నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఇక్కడ నిర్మించిన భవనాన్ని తక్షణమే ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

వార్డు కార్యాలయం కోసం...

◆ అంబర్‌పేట డివిజన్ ప్రజలకు వార్డు కార్యాలయం లేకపోవడంతో ఇక్కడ నిర్మించారు. ప్రస్తుతం అంబర్‌పేట డివిజన్ వాసులకు పటేల్‌నగర్‌లో ఉన్న ఓ బస్తీ కమ్యూనిటీహాల్‌ను వార్డు కార్యాలయంగా వినియోగిస్తున్నారు. దీంతో స్థానికులు తమ కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయంలో కొనసాగుతుండడంతో తమ బస్తీలో ప్రజలకు చిన్న కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది. తమ బస్తీ కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో వార్డు కార్యాలయంగా నిర్వహించడం తమకు ఇబ్బందిగా ఉందంటున్నారు.

కొత్త భవనం ప్రారంభానికి అడ్డంకులేంటీ?

◆ నిర్మించిన కొత్త భవనం ప్రారంభానికి ఉన్న అడ్డంకులు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇండోర్ స్టేడియంలో, మైదనంలో క్రీడాపోటీలు జరుగుతుంటాయి. క్రీడలు జరిగే ప్రాంగణంలో వార్డు కార్యాలయం నిర్మించడం పట్ల గ్రౌండ్ నిర్వాహకులు అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వి.హనుమంతారావు జోక్యంతో భవన వినియోగాన్ని తాత్కలికంగా నిలిపివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురాని పరిస్థితులు ఉండడంతో దురదృష్టకరమని పలువురు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని ఇక్కడి భవనంలో వార్డు కార్యాలయం ఏర్పాటు అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా

కొత్త నిర్మించిన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను. ఉన్న అడ్డంకులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాను. ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకుంటా. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి ఉన్న సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటాను.

– మారుతీదివాకర్ డీఎంసీ సర్కిల్-16

చర్మ హస్త కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



చర్మకారుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మరుగున పడుతున్న చర్మ హస్త కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ చర్మ హస్త కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ... ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వృత్తిదారుల సంక్షేమానికి ఉపయోగించాలని అన్నారు. ఇతర వర్గాల చేతుల్లోకి చర్మకార వృత్తి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్మకార కులానికి సంబంధించిన యువతకు తగిన శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కోరారు. లెదర్ ఫ్యాషన్ డిజైన్ కోర్సులలో 10వ తరగతి పాసైన ఎస్సీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విద్యాసాగర్, హైకోర్టు న్యాయవాది భీమ్‌రావు, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిలు, ప్రధాన కార్యదర్శి నిరజ్‌కుమార్, కోశాధికారి విజయ్‌కాంత్, పారిజాత, మధుసూదన్, ధనలక్ష్మి, సొమ్మ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహలను కుటుంబీకులకు అప్పగించాలి

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

కవాడిగూడ: ఛత్తీస్‌ఘడ్ నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ... ఎన్‌కౌంటర్‌లో 28 మంది మృతదేహాలు నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో కుళ్లిపోయే స్థితికి చేరుకున్నాయని అన్నారు. ఏపీకి చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, నవీన్, సంగీత, తెలంగాణ వరంగల్ చింతగుట్టకు చెందిన రాకేష్, షాద్‌నగర్ వేముల, నర్వ గ్రామానికి చెందిన భూమిక మృతదేహాను అప్పగించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మావోయిస్టు కుటుంబాల మీద ప్రతీకార చర్యలు మానుకోవాలని హితవు పలికారు. శవాలకు కూడా గౌరవంగా అంతిమ సంస్కారాలు చేసే హక్కులు ఉంటాయని ప్రభుత్వాలు మర్చిపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, ఆజాద్, చంద్రమౌళి, అభినవ్, భవాని, రాంబాబు, గాదె ఐన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాల, మాదిగలపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలి



బంధు సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న అప్పికట్ల భరత్‌భూషణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రెండు తెలుగు రాష్ట్రాల్లో మాల మహానాడు, మాదిగ దండోర కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసి సమస్యను పరిష్కరించినందుకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భరత్ భూషణ్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణకు ముగింపు లభించిందన్నారు. దీనికి అనుగుణంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తున్నామని తెలిపారు. బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి మాట్లాడుతూ.. వర్గీకరణకు మద్దతుగా మాదిగలు, వ్యతిరేకంగా మాలలు వివిధ రకాలుగా పోరాటం చేశారన్నారు. ఈ సందర్భంగా పోలీసులు వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. ముత్తయ్య, ప్రొ. నాథనియేల్, వశపాక నరిసింహ, ప్రొ.ఎకూ తిరుపతి, గోవింద్, బెజ్జంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వకం.. వివాదాస్పదం.!



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు తవ్వకాల పనులు వివాదాస్పందంగా మారాయి. బాకారం పోచమ్మ ఆలయం చౌరస్తా నుంచి బాకారం మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులకు కొద్ది రోజుల కిత్రం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శంకుస్థాపన చేశారు. ఈ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం కాంట్రాక్టర్ ద్వారా పాత రోడ్డు పనులు చేపట్టారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజల ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి వీలుగా సగం రోడ్డు వేసి తర్వాత మిగిలిన రోడ్డు వేయాలని స్థానికులు కె.నర్సింగ్‌రావు పలువురు రోడ్డు తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపి ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ వినోద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకు తెలిపారు. వారు అక్కడికి చేరుకుని రోడ్డు మొత్తం ఒకేసారి తవ్వి ఒకేసారి వేస్తామని.. సగం సంగం వేయడం కుదరని స్థానికులతో చెప్పారు. అలా అయితే తమకు చాలా ఇబ్బంది అవుతుందని స్థానికులు తెలిపారు. దీంతో అధికారులు, స్థానికుల మధ్య వాగ్వాదం జరిగింది. స్థానికులు ఒప్పుకోకపోవడంతో అధికారులు రోడ్డు తవ్వకాలను నిలిపేసి వెళ్లిపోయారు. ఈ తర్వాత అధికారులు, స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని చర్చించి ప్రజలకు ఇబ్బందులు జరగకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

'పంచముఖ మహాశివం' ఆడియో ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న ఇస్రో సైంటిస్ట్ కృష్ణకిశోర్, పార్వతీశం

చిక్కడపల్లి: శంకరుడిని స్తుతిస్తూ ప్రముఖ వైద్యుడు వరుణ్‌రాజ్ రూపొందించిన పంచముఖ మహాశివం ఆడియో ఆవిష్కరణ ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగింది. ఇస్రో సైంటిస్ట్ కృష్ణకిశోర్ ముఖ్యఅతిథిగా హాజరై పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, సంగీత కళాకారుడు ఉదయ్‌కుమార్, బుర్రా మోహనకృష్ణ, గౌరీ పద్మావతి, సూర్యనారాయణ మూర్తి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణికురాలి బంగారు గొలుసు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. కాచిగూడ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... వెస్ట్ గోదావరి జిల్లాలకు చెందిన అంబాల నాగలక్ష్మి (53) నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు రావడానికి అంజతా ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తోంది. రైలు ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి రైల్లోకి ప్రవేశించి నాగలక్ష్మి మెడలోని పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. నాగలక్ష్మి ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును ఔరంగాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై హెచ్. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం హస్రాస్‌పెంట హిందూ శ్మశానవాటిక సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (40) చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న దీపక్‌రెడ్డి, కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 122వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నందకిషోర్ యాదవ్ తదితరులు తిలకించారు. మన్ కీ బాత్ కార్యక్రమం కోసం పార్టీ కార్యాలయంలోని హాల్‌లో బిగ్ స్క్రీన్స్‌ను పార్టీ నేతలు ఏర్పాటు చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని శ్రద్ధతో విన్నారు. ప్రధాని చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని లంకల దీపక్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. పార్టీని మరింత బలోపేత చేస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, బల్వీర్, శీర్‌సాగర్, ఎస్.అరవింద్, ఎం.నర్సింగ్‌రావు, వాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి భక్తి సంగీత శిక్షణ తరగతులు



ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న మ్యూజిక్ అకాడమీ నిర్వాహకులు

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి భక్తి సంగీత శిక్షణ తరగతుల ముగింపు వేడుకలు శనివారం రాత్రి తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన నటుడు రాజెండు మౌళి వెన్నలకంటి, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్- యాంకర్ డాక్టర్ సరస్వతి ప్రదీప్ జ్యోతి ప్రజ్వలన కావించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో చిన్నారుల కోసం భక్తి సంగీత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల 'వసంత గానం'సంగీత కచేరి ఆకట్టుకుంది. అందులో జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా ఏర్పడి సంగీత కచేరిలో పాల్గొన్న 80 మందికి పైగా విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాలు అందజేశారు. టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి, వర్ధమాన గాయినీమణి నందిని, మ్యూజిక్ థెరపిస్ట్- కీబోర్డు కళాకారిణి యామినిల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అడమీ విద్యార్థులు, సంగీతాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమాజానికి నాగరికత నేర్పింది విశ్వకర్మనే..



గండ దీపం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయిత డా.అంబటి సురేంద్రరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తొమ్మిదో వార్షికోత్సవం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి రచించిన 'గండ దీపం'పుస్తకాన్ని ప్రముఖ రచయిత డాక్టర్ అంబటి సురేంద్రరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి నాగరికత నేర్పింది విశ్వకర్మనేనని అన్నారు. తన జీవిత అనుభవాలను పుష్పగిరి కవిత్వంగా రాశారని అన్నారు. ఆధునిక కవుల జాబితాలలో పుష్పగిరి తన కవిత్వాల ద్వారా చేరిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని సాంస్కృతిక సంపదను సామాజిక తాత్వికతను కవి పలికించారని అన్నారు.

◆ సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజరి మాట్లాడుతూ... సామాజిక పద చిత్రాలతో పుష్పగిరి గండ దీపాన్ని వెలిగించారన్నారు. ఈ కవిత్వం సబ్బండ కులాల గుండె దీపమని పేర్కొన్నారు. మానవ జీవన ఉత్పత్తి సంబంధాలే ఎక్కువ అని చెప్పారు. వెప్సో ట్రస్ట్ సెక్రటరీ డా.బంగారు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని పేద పంచవృత్తుల వారికి ఎనిమిదేళ్లుగా విద్య, వైద్యం, వివాహం, మహిళా సాధికారత, ప్రకృతి విపత్తులతో సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సంస్థాపక అధ్యక్షుడు బంగారు తాతారావును విశ్వకర్మ లెజెండ్ అవార్డుతో సత్కరించారు.

◆ ఈ కార్యక్రమంలో ఆర్థిక నేరాల సహాయ పోలీసు కమిషనర్ సీసీఎస్ హైదరాబాద్ కమ్మరిపల్లె మల్లికార్జున కిరణ్‌కుమార్, డా. కేఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు కొండపి ఎస్వీ గణేష్‌బాబు, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ అధ్యక్షుడు ఆకారపు శ్రీనివాస్ విశ్వకర్మ, ప్రధాన కార్యదర్శి సొల్లేటి ప్రభాకరాచారి, వెప్సో ట్రస్ట్ సలహాదారు వింజరపు గోవిందరావు, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు వెల్దుర్తి శ్రీమంగేష్, కె.కిరణ్‌కుమార్ ఆచారి. కె.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీరామారావు బహుముఖ ప్రజ్ఞాశాలి

చిక్కడపల్లి: ఎన్టీ రామారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఆదివారం రాత్రి రామ్‌కుమార్ కళారవిందం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జరిగిన ఎన్టీ రామారావు కళా సాహితీ జాతీయ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా వేణుగోపాలాచారి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌కు పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. తొలుత 'జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి..'శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయకులు పాటలను మధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఓలేటి పార్వతీశం, దైవజ్ఞశర్మ, వంశీ రామరాజు, రవికుమార్, అఖిల, రేవతి, భార్గవి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బుర్రా సాయిమాధవ్‌ను ఎన్టీరామారావు కళా సాహితీ జాతీయ పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలో ప్రధాన, అంతర్గత వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు వీధులు శుభ్రం చేసి ఓపెన్ పాయింట్ల వద్ద చెత్తను కుప్పలుగా పోస్తున్నారు. గతంలో చెత్త కుండీల రహిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం గొప్పలు చెప్పుకుంది. అలాగే కుండీలను తొలగించిన ప్రాంతాలలో ముగ్గులు వేసి వీధుల్లో ఎవరూ చెత్తను వేయొద్దని అవగాహన కల్పించారు. ఇంటింటికీ వచ్చే చెత్త రిక్షాలకే చెత్తను ఇవ్వాలని కోరారు. కానీ అధికారులు ఆయా ప్రాంతాల్లోని చెత్త కుండీలను తొలగించడం గమనార్హం.

◆ ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణను రాంకీ సంస్థకు అప్పగించడంతో కథ మొదటికి వచ్చింది. ఎక్కడ చూసినా వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. చెత్త కుండీలలో చెత్త నిండిపోవడంతో చేసేది లేక వాటి పక్కనే చెత్తను పడేస్తున్నారు. ఏరోజుకారోజు చెత్తను తరలిస్తే ఇలాంటి దుస్థితి రాదు కదా అని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి ఓపెన్ పాయింట్ల వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గోల్నాక కల్లు కంపౌండ్ వద్ద ఇలా..



తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్స్